


నిజామాబాద్‌లోని కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డులో కమ్ముకున్న పొగమంచు



కామారెడ్డి పట్టణంలో..



చందూర్ మండలకేంద్రంలో ఓ భవనంపై...

# మంచు దుప్పటి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను పొగ మంచు కమ్మేసింది. శనివారం తెల్లవారుజాము నుంచే ఊర్లు, పైర్లు శ్వేతవర్ణమైన మంచుతెరలతో కనిపించకుండా పోయాయి. పల్లెల్లన్నీ పూర్తిగా మంచుగుప్పిట్లోకి చేరిపోయాయి. ఉదయం 9 దాటిన తర్వాత కూడా మంచుతెరలు వీడలేదు. ఎదురుగా ఏమీ కనిపించకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

– ఎల్లారెడ్డి రూరల్/ చందూర్/ కామారెడ్డి, నవంబర్ 2



ఎల్లారెడ్డిలో..



నిజామాబాద్ జిల్లాకేంద్రంలో చలిలో వెళ్తున్న వృద్ధుడు



శనివారం తెల్లవారుజామున పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డులు

# హోంగార్డుల కట్టడి

వినాయక్‌నగర్, నవంబర్ 2: డిమాండ్ల సాధన కోసం పోరుబాట పట్టాలని భావించిన హోంగార్డులను ఉన్నతాధికారులు కట్టడి చేశారు. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో శనివారం తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళ్లకుండా ఆరు గంటలకు పైగా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లోనే ఖాళీగా కూర్చోబెట్టారు. హోంగార్డులు హైదరాబాద్ రాకుండా కట్టడి చేయాలని ఒకరోజు ముందే ఉన్నతాధికారులు జిల్లా బాధ్యులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేసే హోంగార్డులు ఆందోళనకు వెళ్లకుండా జిల్లా అధికారులు ఆంక్షలు విధించారు. శనివారం ఉదయం 5.30 గంటలకే పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌కు రావాలని ఆదేశించడంతో హోంగార్డులు తెల్లవారుజామునే చేరుకున్నారు. అందరినీ దాదాపు నిర్బంధించినంత పని చేసిన అధికారులు.. పరేడ్ నిర్వహించి, అటెండెన్స్ తీసుకున్నారు. అల్పాహారం కోసం కాసేపు వదిలి, టిఫిన్ చేసి మళ్లీ గ్రౌండ్‌కు రావల్సిందిగా ఆర్ఐలు, ఆర్ఎస్సైలు ఆదేశించారు. టిఫిన్స్ చేసి వచ్చాక మధ్యాహ్నం వరకు గ్రౌండ్ నుంచి బయటికి వెళ్లనివ్వలేదు. మధ్యాహ్నం తర్వాత హోంగార్డులందరితో రిజిస్టార్‌లో సంతకాలు తీసుకున్న అనంతరం ఎవ్వరూ ఎలాంటి ఆందోళన కార్యక్రమాలకు వెళ్లకూడదని చెప్పి, బయటకు పంపించారు. ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో సైతం విధులు నిర్వహిస్తున్న హోంగార్డులను ఆ ఏరియాలోని పోలీస్ అధికారుల కార్యాలయాలకు రప్పించుకుని, వారిని సైతం మధ్యాహ్నం వరకు ఆఫీసుల్లోనే కూర్చోబెట్టారు.

## మాజీ హోంగార్డు నిర్బంధం

సిరికొండ, నవంబర్ 2: 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి బయల్దేరుతున్న మాజీ హోంగార్డు, బీఆర్ఎస్ నేత భూక్యా గంగాధర్‌ను సిరికొండ పోలీసులు శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ధర్నాకు వెళ్తుండగా అరెస్టు చేసి, పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం హోంగార్డులు తలపెట్టిన శాంతియుత కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.




మాజీ హోంగార్డు, బీఆర్ఎస్ నేత భూక్యా గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్న సిరికొండ పోలీసులు

# తూకంలో తేడా రావొద్దు

- ధాన్యంలో చెత్త లేకుండా చూడాలి
- కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



పోసానిపేట్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

రామారెడ్డి, నవంబర్ 2 : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. రామారెడ్డి మండలం పోసానిపేట్‌లోని కొనుగోలుకేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. కాంటా వేస్తున్న ధాన్యాన్ని పరిశీలించి.. ప్యాడీ క్లీనర్ల ద్వారా వడ్లలో చెత్త లేకుండా చూడాలన్నారు. ఒక్కో బస్తా 40 కిలోల 600 గ్రాములు మాత్రమే తూకం వేయాలని స్పష్టం చేశారు. వర్షానికి ధాన్యం తడిసి పోకుండా కేంద్రాల్లో టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కలెక్టర్‌వెంట జిల్లా సహకార అధికారి రామ్మోహన్, మానిటరింగ్ అధికారి సాయిలు ఉన్నారు.

# కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

- మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ తీసుకోవాలి
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ధాన్యం సేకరణపై కలెక్టర్లతో సమీక్ష

కామారెడ్డి/కంఠేశ్వర్, నవంబర్ 2: జిల్లాల్లో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే పూర్తిస్థాయిలో ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ధాన్యం సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన కలెక్టర్లతో శనివారం సమీక్షించారు. నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రారంభమైందని తెలిపారు. ధాన్యం కేటాయింపు ప్రక్రియ కూడా కొనసాగుతున్నదని, 90 మిల్లులు అండర్ టేకింగ్ ఇచ్చాయని చెప్పగా, మంత్రి కలెక్టర్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇదే తరహా చొరవ చూపుతూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కొనుగోళ్లు కూడా మొదలు పెట్టినట్లు చెప్పారు. అవసరమైన గోదాంలను గుర్తించామన్నారు. సన్నరకం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిందని, సన్నరకం కొనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దొడ్డు రకం ధాన్యం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. తాలు, తప్ప పేరుతో కోతలు విధించొద్దని, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించిన తర్వాతే కాంటా చేయాలని సూచించారు. బ్యాంకు గ్యారంటీలు తీసుకున్నాకే మిల్లర్లకు ధాన్యం కేటాయించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, విక్టర్, సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, రెవెన్యూ, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న నిజామాబాద్ కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

# అంతా గందరగోళం

- సివిల్ సప్లయిస్‌లో తరచూ ట్రాన్స్‌ఫర్లు
- కీలక సమయంలో అధికారుల బదిలీలు
- కొత్త వారి చేతుల్లో బాధ్యతలు
- నిజామాబాద్‌లో నలుగురు డీఎంల మార్పు
- కామారెడ్డిలోనూ అంతా కొత్త వారే
- ధాన్యం కొనుగోళ్లపై నెలకొన్న స్తబ్ధత





నిజామాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పౌరసరఫరాల శాఖలో తీవ్ర గందరగోళం నెలకొన్నది. ఉభయ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. పౌర సరఫరాల శాఖ, పౌర సరఫరాల సంస్థలో నెలకొన్న అయోమయం ధాన్యం కొనుగోళ్లపై పెను ప్రభావం చూపుతున్నది. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత తరచూ అధికారులను బదిలీ చేస్తుండడం, కొత్త అధికారులకు జిల్లాపై పట్టు లభించే సమయంలోనే బదిలీ అవుతుండడంతో ధాన్యం సేకరణలో మందగమనం చోటు చేసుకుంటున్నది. కీలకమైన వడ్ల కొనుగోళ్లలో అధికారుల అనుభవం, సమయస్ఫూర్తి ప్రధాన పాత్ర పోషిస్తుంది. కానీ, రేవంత్ సర్కారు ముందుచూపు లేకుండా వ్యవహరిస్తూ, ఇష్టారీతిన ట్రాన్స్‌ఫర్లు చేస్తుండడం వల్ల ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్నదాతల సంక్షేమాన్ని గాలికొదిలేసిన అధికార పార్టీ నేతలు.. ఉమ్మడి జిల్లాలో కల్లాలు దాటని వడ్ల విషయంలో కనీసం స్పందించడం లేదు. కేసీఆర్ హయాంలో పంట కోతల సమయానికే యంత్రాంగాన్ని సిద్ధం చేసేవారు. వచ్చిన పంటను వచ్చినట్లు కొనుగోలు చేసి వెంట వెంటనే తరలించడంతో పాటు వేగంగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేవారు. అప్పట్లో వడ్ల సేకరణలో రాష్ట్రంలోనే కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలు పోటీ పడి తొలి స్థానాల్లో నిలిచేవి. ఒకానొక దశలో ధాన్యం సేకరణలో టాప్ 1లో ఉభయ జిల్లాలు ఉండేవి. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది.

## కామారెడ్డిలోనూ అంతే..

కామారెడ్డిలోనూ ఇదే దుస్థితి కొనసాగుతున్నది. పౌరసరఫరాలకు ఆయువు పట్టుగా ఉండే అదనపు కలెక్టర్(రెవెన్యూ) పోస్టు ఆర్నెళ్లుగా ఇన్‌చార్జి అధికారి చేతుల్లోనే ఉంది. హెచ్ఎండీఏలో పని చేస్తున్న విక్టర్‌ను వారం క్రితం అదనపు కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. వాస్తవానికి ఆయనకు రెవెన్యూ శాఖలో అంతగా పట్టు లేదని, ధాన్యం కొనుగోళ్లపైనా అనుభవం లేదని ఆ శాఖ ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. దీనికి తోడుగా రెండు నెలల క్రితమే కామారెడ్డి పౌరసరఫరాల శాఖ అధికారిగా, పౌరసరఫరాల సంస్థ డీఎంగా వచ్చిన అధికారులతో ఏ విధంగా సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. కామారెడ్డి పౌరసరఫరాల సంస్థ డీఎం రాజేందర్ ప్రమోషన్ లిస్టులో ఉండడంతో, ఆయన ఎక్కువ కాలం ఇక్కడ పని చేసే అవకాశాలు లేవని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

## ఏమవునో..?

రైస్ మిల్లర్ల నుంచి సీఎంఆర్ కేటాయింపుల్లో భాగంగా ష్యూరిటీ ప్రక్రియ నెమ్మదిగా జరుగుతున్నది. రైస్ మిల్లర్లతో మాట్లాడి వారితో ఒప్పందాలు చేయించడం యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. ఈ పరిస్థితిలో కామారెడ్డిలో కొత్త అధికారుల పరిపాలన మీదుగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఏ విధంగా ముందుకు పడుతుందనేది అయోమయంగా మారింది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కీలక స్థానాలకు వచ్చిన అధికారులకు జిల్లా భౌగోళిక పరిస్థితులు, సారూప్యతలపై పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పడాలంటే నెల రోజులైనా పడుతుంది. ఆలోపు కొనుగోళ్ల ప్రక్రియ జోరందుకునే పరిస్థితి కనిపించడం లేదు. మొత్తానికి ధాన్యం సేకరణ ప్రక్రియలో సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై రైతాంగం పెదవి విరుస్తున్నది.



## ఏడాదిలో నలుగురు మార్పు..

నిజామాబాద్ జిల్లా పౌరసరఫరాల సంస్థకు సంబంధించి పది నెలల కాలంలో నలుగురు మేనేజర్లు మారారు. ఎడాపెడా స్థాన చలనం చేస్తుండడంతో అధికారులకు జిల్లాపై పట్టు రావడం లేదు. కాంగ్రెస్ అధికారం చేపట్టే నాటికి పౌరసరఫరాల శాఖ అధికారిగా చంద్రప్రకాశ్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా జగదీశ్ ఉన్నారు. ఆ ఇద్దరిని సస్పెన్షన్ చేసిన ప్రభుత్వం డీఎంగా రాజేందర్‌ను నియమించింది. కానీ, నెల రోజుల్లోనే బదిలీ చేశారు. ఆయన స్థానంలో.. రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ హోదాలో ఉన్న రమేశ్‌బాబుకు పౌరసరఫరాల సంస్థ డీఎంగా నియమించారు. మూడు నెలల కాలంలోనే ఆయనను సైతం పక్కకు జరిపారు. రమేశ్‌బాబు స్థానంలో మరో ఆర్డీవోకు బాధ్యతలు అప్పగించారు. గతంలో బోధన్ ఆర్డీవోగా పని చేసిన అంబదాస్ రాజేశ్వర్‌ను పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా నియమిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇలా ఏడాది కాలంలోనే నలుగురు మారడంతో అంతా గందరగోళం నెలకొంది. ఎవరు వచ్చారో? ఎవరు వెళ్లారో తెలియని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే వానకాలానికి పంట కోతలు జోరందుకున్నాయి. కానీ, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఇంకా ఆరంభ దశలోనే ఉంది. లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రోడ్ల పక్కనే పేరుకుపోయింది. కొనుగోలు కేంద్రాలను సర్కారు తెరుస్తున్నప్పటికీ కాంటా మాత్రం వేయడం లేదు. ఈ సమయంలో అధికారుల మార్పు అన్నది కొనుగోళ్లకు ఆటంకంగా మారుతున్నది.

